క్లుప్తంగా

రేపు బీఆర్‌ఎస్ విస్తృతస్థాయి సమావేశం

విజయవంతం చేయాలని పార్టీ నాయకుడు జయేందర్ పిలుపు

కందుకూరు: ఈ నెల 6న (రేపు) మీర్‌పేటలోని ఎస్‌వైఆర్ గార్డెన్‌లో నిర్వహించనున్న మహేశ్వరం నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు జయేందర్‌ముదిరాజ్ ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు నిర్వహించే సమావేశానికి బీఆర్‌ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, స్థానిక ఎమ్మెల్యే సబితారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారని తెలిపారు. పార్టీ సీనియర్ నాయకులు, పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, యూత్ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, అనుబంధ సంఘాలతో పాటు కార్యకర్తలు, అభిమానులు హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

నర్సింహారెడ్డికి సన్మానం


నర్సింహారెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

కందుకూరు: బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా నాలుగోసారి బాధ్యతలు చేపట్టిన నర్సింహారెడ్డిని ఆదివారం మండల పరిధిలోని రాచులూరుకు చెందిన ఆ పార్టీ నాయకులు సన్మానించారు. పార్టీ బలోపేతానికి నర్సింహారెడ్డితో కలిసి పని చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు అంజయ్య, సురేశ్‌చారి, నర్సింహా ముదిరాజ్, నర్సింహ, చంద్రయ్య, విష్ణు, శంకర్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మె నోటీసు అందజేత


నోటీసు అందిస్తున్న మున్సిపల్ కార్మికులు

ఆమనగల్లు: ఈనెల 16న దేశవ్యాప్తంగా జరిగే గ్రామీణ భారత్‌బంద్ సమ్మెను జయప్రదం చేయాలని ఆమనగల్లు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు విజయ్‌కుమార్ కోరారు. ఆమనగల్లు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఆదివారం మున్సిపల్ కమిషనర్ శ్యాంసుందర్‌కు ఈమేరకు సమ్మె నోటీసును వారు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఇందిరమ్మ ఇళ్లను కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వర్కర్స్ యూనియన్ నాయకులు రవి, జంగయ్య, సుధాకర్, రాములు, యాదమ్మ, బాలమణి, లక్ష్మమ్మ, జంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

యాచారం: ఈనెల 16న ప్రజా సంఘాలు తలపెట్టిన దేశవ్యాప్త బంద్‌ను విజయవంతం చేయాలని కోరుతూ ఆదివారం మండల పరిధిలోని పలు గ్రామాల్లో రైతు సంఘం జిల్లా కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అంజయ్య, బ్రహ్మయ్య, ఐలయ్య, అరుణ, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

తలకొండపల్లి: కల్వకుర్తిలోని అయ్యప్ప ఆలయ నిర్మాణానికి ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ విరాళం అందజేశారు. ట్రస్టు నిధుల నుంచి ఆదివారం రూ.5లక్షలు విలువ చేసే స్టీల్, సిమెంట్ అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్టు నిర్వాహకులను గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, ట్రస్టు సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

మాడ్గుల: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించే చెకుముకి రాష్ట్రస్థాయి టాలెంట్ టెస్ట్‌కు మాడ్గుల మండలం ఇర్విన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని తుర్కయంజాల్ మున్సిపాలిటీలో ఆదివారం నిర్వహించిన జిల్లాస్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్టుల్లో ప్రతిభ కనబర్చిన ఇర్విన్‌కి చెందిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు స్నేహిత్, జునైద్, అఫ్సాన్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పర్వతాలు అభినందించారు.

కొనసాగుతున్న కల్యాణ మహోత్సవం

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధి మునగనూర్‌లోని భ్రమరాంభ సహిత మల్లికార్జున స్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా ఆదివారం ఊరేగింపు నిర్వహించారు. అనంతరం బోనాల సమర్పణ, ఒగ్గు కథలతో ఆలయ ప్రాంగణం మారుమ్రోగింది. సోమవారం తెల్లవారుజామున స్వామివారి కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తలు బాల్‌రాజ్, శ్రీనివాస్, వీరేశంగౌడ్ తెలిపారు.

లక్ష్యం నెరవేరేనా?

- కొనసాగుతున్న పన్నుల వసూలు
- స్పెషల్ డ్రైవ్ చేపడుతున్న మున్సిపల్ అధికారులు
- ప్రత్యేక కౌంటర్ల ఏర్పాటు
- మార్చి 31తో ఆఖరు


జల్‌పల్లి మున్సిపల్ కార్యాలయం

అభివృద్ధి పనులు చేపట్టేందుకు స్థానిక సంస్థలకు పన్నుల ఆదాయమే కీలకం. ప్రధాన ఆదాయ వనరులైన పన్నుల వసూలుపై జల్‌పల్లి మున్సిపల్ అధికారులు దృష్టి సారించారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పన్ను వసూలును ప్రత్యేకంగా ప్రారంభించారు. ఈ ఏడాది వంద శాతం వసూలయ్యేలా సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ఈ మేరకు స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నారు. ఇబ్బంది లేకుండా ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు.

పహాడీషరీఫ్: 2023–24 ఆర్థిక సంవత్సరం ముగింపుకు గడువు దగ్గర పడుతుండడంతో జల్‌పల్లి మున్సిపాలిటీలో ఆస్తి పన్ను వసూలు లక్ష్యాన్ని చేరుకునేందుకు అధికారులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. కరోనా విపత్కర పరిస్థితులు (లాక్‌డౌన్) ఉన్న 2020–21 సంవత్సరంలో 96.35 శాతం వసూలు చేసి ఆదర్శంగా నిలిచారు. ఈ ఏడాది ఆ మార్కును అధిగమించాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని జల్‌పల్లి, శ్రీరాం కాలనీ, పహాడీషరీఫ్, వాదే ముస్తఫా, వాదే సాల్హెహీన్, షాహీన్‌నగర్, ఎర్రకుంట, కొత్తపేట, బిస్మిల్లా కాలనీ, సలాల ప్రాంతాల్లో బిల్ కలెక్టర్లు ఇంటింటికీ తిరుగుతూ ఆస్తి పన్నుపై అవగాహన కల్పిస్తున్నారు. అంతేకాదు మార్చి 31వ తేదీ లోపు లక్ష్యాన్ని చేరుకోవాలని ప్రయత్నాలు చేస్తున్నారు. గడువుకు 55 రోజులే మిగిలి ఉంది. దీంతో అధికారులు మరింత అప్రమత్తమయ్యారు.

పెరిగిన లక్ష్యం

జల్‌పల్లి మున్సిపాలిటీలో మొత్తం 34,856 నివాసాలు, 3191 ట్రేడ్ లైసెన్స్‌లను కలుపుకొని ఈ ఏడాది ఆస్తి పన్ను లక్ష్యాన్ని రూ.16 కోట్లుగా నిర్దేశించుకున్నారు. ఇప్పటివరకు రూ.3,43,77,000 వసూలు చేశారు. గడువులోపు వసూలు చేయాలని బిల్ కలెక్టర్లను మున్సిపల్ కమిషనర్ ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నారు. బస్తీల్లో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. స్వచ్ఛందంగా మున్సిపాలిటీకి వచ్చి చెల్లించే వారి కోసం కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్‌లను కూడా ఏర్పాటు చేశారు.

వేగం పెంచాలి

జల్‌పల్లి మున్సిపాలిటీలో చాలా వరకు ప్రభుత్వ స్థలాల్లోనే నివాసాలు నిర్మించుకున్నారు. ప్రజలు భయంతో ఆస్తి పన్ను పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు చెల్లిస్తున్నారు. నివాస గృహాల నుంచి ఈ ఏడాది ఆశించిన స్థాయిలో వసూలు అయినప్పటికీ.. వ్యాపార సముదాయాల నుంచి ఇంకా పూర్తి స్థాయిలో వసూలు కాలేదు. నోటరీ డాక్యుమెంట్ల సమస్య పరిష్కారమైతే మరింత ఆదాయం పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. వసూలులో వేగం పెంచాలని సిబ్బందికి అధికారులు సూచిస్తున్నారు.

ఎన్నికల నిర్వహణతో ఆలస్యం

ఈ ఆర్థిక సంవత్సరంలో పన్నులు వసూలు చేసేందుకు సిబ్బందికి ఎన్నికలు, ప్రజాపాలన విధులు అడ్డంకిగా మారాయి. గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బీఎల్‌ఓ విధులు నిర్వహించే బిల్ కలెక్టర్లు ఆగస్టు నెల నుంచే ఓటర్ల జాబితా పనిలో నిమగ్నమయ్యారు. తీరా ఎన్నికలు ముగిశాక ప్రజాపాలన ప్రారంభం కావడంతో పది రోజుల పాటు దరఖాస్తుల స్వీకరణ, ఆపై డేటా ఎంట్రీ ప్రక్రియ కొనసాగింది. ఇలా దాదాపు ఐదారు నెలల పాటు ఆస్తి పన్ను వసూలు చేసేందుకు అవకాశం లేకుండా పోయింది. తాజాగా పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియ సైతం మరికొన్ని రోజుల్లో ప్రారంభంకానున్న నేపథ్యంలో త్వరగా ఆస్తి పన్ను వసూలు చేయడంపై దృష్టి సారిస్తున్నారు.

అభివృద్ధిలో భాగస్వాములు కండి



సకాలంలో ఆస్తి పన్ను చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధిలో భాగస్వాములు కావాలి. మార్చి 31 నాటికి 100 శాతం లక్ష్యాన్ని చేరుకునేలా ముందుకు సాగుతున్నాం. అవసరమైతే వారంలో రెండు రోజుల పాటు బిల్ కలెక్టర్లు తమ తమ పరిధిలో 'ఆస్తి పన్ను మేళా'ను నిర్వహించేలా చూస్తాం. పన్నులు పూర్తి స్థాయిలో చెల్లించడం ద్వారా మున్సిపాలిటీని మరింత అభివృద్ధి చేస్తాం.

– ఎస్. వసంత, జల్‌పల్లి మున్సిపల్ కమిషనర్

ఏకగ్రీవంగా కాంగ్రెస్ కమిటీ ఎన్నిక


కాంగ్రెస్ కమిటీని సన్మానిస్తున్న నాయకులు

కందుకూరు: మండల పరిధిలోని మీర్‌ఖాన్‌పేట గ్రామ కాంగ్రెస్ పార్టీ నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామశాఖ అధ్యక్షుడిగా మాజీ సర్పంచ్ నర్సింహ, ప్రధాన కార్యదర్శులుగా వెంకటేశ్, చంద్రశేఖర్, ఉపాధ్యక్షులుగా ఆలూరి జంగయ్య, బొమ్మరాజు జంగయ్య, కడారి మహేశ్, కాకి సత్తయ్య, కార్యదర్శులుగా వీరారెడ్డి, శ్రీనివాస్, ప్రచారకార్యదర్శిగా వెంకటేష్, కోశాధికారిగా చంద్రశేఖర్‌రెడ్డిని ఎన్నుకున్నారు. సభ్యులుగా రాజు, రాములు, లక్ష్మయ్య, శేఖర్‌గౌడ్, పాండు, శ్రీకాంత్, శ్రీశైలం, రాములు, రాము, జంగయ్య, సలహాదారులుగా గండు రవి, వెంకట్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, రాంచంద్రయ్య, బాలరాజు, నర్సింహ, విష్ణు, డి.జంగయ్య, సంతోష్‌కుమార్, యాదయ్యను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మదన్‌పాల్‌రెడ్డి, జగదీష్‌బాబు, చిన్న నర్సింహ, డి.వెంకటేశ్, విజేందర్‌రెడ్డి, శ్రావణ్ కుమార్‌రెడ్డి, బల్వంత్‌రెడ్డి, మధుసూదన్, విజేందర్, వినయ్ పాల్గొన్నారు.

ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయొద్దు


రోగులకు మందులు పంపిణీ చేస్తున్న విశ్వేశ్వర్‌రెడ్డి తదితరులు

మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

కందుకూరు: గ్రామాల్లో ప్రజలు ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయొద్దని, ఎప్పటికప్పుడు వైద్యులతో పరీక్షలు చేయించుకోవాలని మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సూచించారు. మండల పరిధిలోని దెబ్బడగూడలో స్థానిక ఎంపీటీసీ సభ్యురాలు లక్ష్మి ఆధ్వర్యంలో ఆదివారం జస్టిస్ కొండా మాధవరెడ్డి ఫౌండేషన్ సంస్థ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించింది. శిబిరాన్ని విశ్వేశ్వర్‌రెడ్డి ప్రారంభించి రోగులకు మందులు పంపిణీ చేశారు. అనంతరం అయోధ్య రామాలయ ప్రసాదాన్ని గ్రామస్తులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పేదలకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు. శిబిరంలో అపోలో ఆస్పత్రి వైద్యులు అరుంధతి, డాక్టర్ సంతోశ్, సయ్యద్ రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గం కన్వీనర్ దేవేందర్‌రెడ్డి, ఎంపీపీ జ్యోతిపాండు, బీజేపీ సీనియర్ నాయకులు జంగారెడ్డి, సుధాకర్‌రెడ్డి, భూమిరెడ్డి, చెన్నారెడ్డి, అశోక్‌రెడ్డి, మంద పాండు, బాబురావు, శ్రీశైలం, సందీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తెస్తాం

పార్టీ నాయకుడు దశరథ

మహేశ్వరం: మహేశ్వరం మండలంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తీసుకొస్తామని ఆ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు కావలి దశరథ ప్రకటించారు. ఆదివారం మండల పరిధిలోని నాగారం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం దశరథ మాట్లాడుతూ.. మహేశ్వరం మండలం కాంగ్రెస్ పార్టీకి కంచుకోట అని అన్నారు. కొందరు పార్టీ నుంచి గెలిచి, స్వలాభం కోసం పార్టీకి ద్రోహం చేశారని విమర్శించారు. గ్రామాలు, తండాల్లో పర్యటించి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. రాబోయే పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుతామని ధీమా వ్యక్తం చేశారు.

గ్రామ కమిటీ ఎన్నిక

కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడిగా ఘనపురం రాజు ముదిరాజ్, ఉపాధ్యాక్షుడిగా ఎండీ అన్వర్ ఖాన్, ప్రధాన కార్యదర్శిగా సిద్ధూ గౌడ్, కార్యదర్శిగా ఎండీ ఫిరోజ్‌ఖాన్, సోషల్ మీడియా అధ్యక్షుడిగా షేక్ హమీద్, కార్యవర్గ సభ్యులుగా ఫిరోజ్‌ఖాన్, షేక్ ఫైజల్, మల్లేశ్, ఎండీ షకీర్‌ఖాన్, సిద్దులు గౌడ్, షేక్ మొయిన్, అనిల్, శ్రీశైలం, నర్సింహ, దసియా, రెడ్యా, షేక్ జాంగీర్‌ను ఎన్నికయ్యారు.

ఐకమత్యంతో అభివృద్ధి సాధ్యం


సమావేశంలో మాట్లాడుతున్న మహేశ్

మీర్‌పేట: ఐకమత్యంతోనే మౌలిక సమస్యలకు పరిష్కారం లభిస్తుందని మీర్‌పేట మున్సిపాలిటీ సెవన్‌హిల్స్ కాలనీ సంక్షేమ సంఘ అధ్యక్షుడు మహేశ్ అన్నారు. ఆదివారం కాలనీ సంక్షేమ సంఘ కార్యనిర్వాహక అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహేశ్ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారుల సహాయ సహకారాలతో ఇప్పటి వరకు బీటీ. సీసీ రోడ్లు, తాగునీటి సరఫరా, వీధిదీపాలు, భూగర్భ డ్రైనేజీ సమస్యలను కొతమేరకు పరిష్కరించుకున్నామని తెలిపారు. కాలనీలో అంతర్గత రహదారులు, పారిశుద్ధ్యం, ఇతర సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. సంఘటితంగా సమస్యలను పరిష్కరించుకుందామని కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు రామాంజనేయులు, జగదీశ్, రాజిరెడ్డి, లక్ష్మణ్ రాథోడ్, మోహన్, యాదగిరి, బాషానాయక్, రాజశేఖర్‌రెడ్డి, బారాజ్, నీలా యాదగిరిగుప్తా, శ్రీనివాస్, గోపాలకృష్ణ, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

రైతుబజార్లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో...రూపాయల్లో...) టమోటా లోకల్ 23, వంకాయ 18, బెండ 50, పచ్చిమిర్చి 45, కాకర 45, బీర 40, క్యాలీఫ్లవర్ 18, క్యాబేజీ 21, క్యారెట్ 21, దొండ 43, ఆలు 25, ఉల్లి 19, గోకర 50, దోస 18, సొర 11, పొట్ల 13, అరటి 09, చిక్కుడు 40, అర్వి 57, మునగ 80, చిలగడదుంప 55, బీట్‌రూట్ 19, కీర 25, ఫ్రెంచ్ బీన్స్ 40, కాప్సికమ్ 60. సోమవారం 9 గంటల వరకు మాత్రమే ఈ ధరలు అమలులో ఉంటాయి.

తైక్వాండోలో బంగారు పతక విజేతకు సత్కారం

హస్తినాపురం: వనస్థలిపురం ప్రాంతానికి చెందిన సీనియర్ న్యాయవాది ఎన్వీ రమణ కుమారుడు, లా విద్యార్థి ఎన్.వెంకట అభిరామ్ రాజస్థాన్ రాష్ట్రంలో నిర్వహించిన జాతీయ సీనియర్ తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీల్లో బంగారు పతకం సాధించారు. వెంకట అభిరామ్‌ను హయత్‌నగర్ మెట్రోపాలిటన్ కోర్టులో జడ్జి సల్మాఫాతిమా శాలువాకప్పి అభినందించారు. ఈ సందర్భంగా జడ్జి ఫాతిమా మాట్లాడుతూ, అభిరామ్ భవిష్యత్‌లో తైక్వాండోలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు వేణుగోపాల్, సత్యనారాయణ, వంశీకృష్ణ పాల్గొన్నారు.

యాదవులు అభివృద్ధి చెందాలి

యాదవ సంఘం మండల అధ్యక్షుడు పర్వతాలు


కందుకూరులో సమావేశమైన యాదవ సంఘం నాయకులు

కందుకూరు: యాదవులు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా అభివృద్ధి చెందాలని యాదవ సంఘం మండల అధ్యక్షుడు పర్వతాలు యాదవ్ ఆకాంక్షించారు. ఆదివారం మండల కేంద్రంలోని సీతారామశాస్త్రి ఫంక్షన్‌హాల్‌లో యాదవ సంఘం ప్రతినిధులతో సమావేశమైయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. యాదవులు ఐకమత్యంగా హక్కులను సాధించుకుందామని పిలుపునిచ్చారు. రాజకీయాలకు అతీతంగా కలిసి మెలసి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు బాల్‌రాజుయాదవ్, మైసయ్యయాదవ్, నర్సింహాయాదవ్, రామకృష్ణయాదవ్, చెన్నయ్యయాదవ్, అంజయ్యయాదవ్, సుధాకర్‌యాదవ్, రాజుయాదవ్. శ్రీనుయాదవ్, జనార్దన్‌యాదవ్, మల్లేషయాదవ్, విశ్వనాథ్‌యాదవ్, ఆంజనేయులుయాదవ్, రాజశేఖర్‌యాదవ్ పాల్గొన్నారు.

గెలుపోటములు సహజం

మాజీ సర్పంచ్ ఇందిర


విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న ఇందిర తదితరులు

కందుకూరు: క్రీడల్లో గెలుపోటములు సహజమని, క్రీడలతో నాయకత్వ లక్షణాలు అలవడుతాయని మాజీ సర్పంచ్ ఇందిర సూచించారు. ఆదివారం మండల పరిధిలోని అన్నోజిగూడలో క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమంలో ఆమె పాల్గొని విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఇందిర మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో వ్యవహరిస్తూ ఓటమిని గెలుపునకు నాందిగా తీసుకోవాలన్నారు. క్రీడాకారులను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలన్నారు. అనంతరం ప్రథమ స్థానంలో నిలిచిన జట్టుకు ట్రోఫీతో పాటు ఆమె సొంతంగా రూ. 10 వేలు నగదు అందజేశారు. ద్వితీయ స్థానంలో నిలిచిన జట్టుకు గ్రామానికి చెందిన ఢిల్లీ కృష్ణ రూ.7 వేలు నగదు అందించారు. కార్యక్రమంలో ఆయా జట్ల స్పాన్సర్లు సుధాకర్, రామకృష్ణ, సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షుడు రఘురాం రాథోడ్, నిర్వాహకులు శివకుమార్, శ్రీకాంత్, శివకృష్ణ, శివ, భాను పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



వైద్య శిబిరంలో పాల్గొన్న చంద్రశేఖర్‌గుప్తా, ఉపేందర్‌రెడ్డి తదితరులు

దిల్‌సుఖ్‌నగర్: ఉచిత వైద్య శిబిరాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వాసవి కాలనీ అధ్యక్షుడు చంద్రశేఖర్ గుప్తా అన్నారు. ఆదివారం వాసవి కాలనీలోని సీనియర్ సిటిజన్ భవనంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ గుప్తా మాట్లాడుతూ, మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని సూచించారు. సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతిరోజూ నడకతో పాటు వ్యాయామం అలవాటు చేసుకోవాలని అన్నారు. ఆసుపత్రి సీఓఓ డాక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఉచిత వైద్య శిబిరంలో దాదాపు 300 మంది వివిధ పరీక్షలు చేయించుకున్నారని తెలిపారు. రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్‌రెడ్డి, కాలనీ వాసులు పాల్గొన్నారు.

ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేయండి

ఆమనగల్లు: ఆమనగల్లులో క్రీడాకారుల కోసం ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేయాలని ఆమనగల్లు బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణనాయక్, ప్రధాన కార్యదర్శి కొట్ర మల్లేశ్ కోరారు. హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో ఆదివారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని ఆమనగల్లు బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కసిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని ఘనంగా సత్కరించారు. ఆమనగల్లులో ఇండోర్ స్టేడియం కోసం స్థలం సేకరించి స్టేడియం నిర్మించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్లు బ్యాడ్మింటన్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్లు ఇలా.. ప్రయాణం ఎలా?

- అధ్వానంగా జంగారెడ్డిపల్లి, చంద్రాయణపల్లి రహదారులు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు, ప్రయాణికులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు


గుంతలమయంగా జంగారెడ్డిపల్లి-చంద్రాయణపల్లి రోడ్డు

ఆమనగల్లు: ఆమనగల్లు మండల కేంద్రం నుంచి మాడ్గుల మండలం ఇర్విన్ గ్రామానికి వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. మూడు జిల్లాలను కలిపే ఈ రోడ్డు పూర్తిగా గోతులమయం కావడంతో ప్రయాణికులు నరకయాతన పడుతున్నారు. ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని జంగారెడ్డిపల్లి నుంచి మాడ్గుల మండలం చంద్రాయణపల్లి వరకు ఉన్న రోడ్డు అడుగడుగునా గుంతలు ఏర్పడి రోడ్డంతా ధ్వంసమయ్యింది. రోడ్డు ఆధునీకరణకు నిధులు మంజూరైనా పనులు మాత్రం ప్రారంభం కాలేదు. కనీసం మరమ్మతులు చేసి రోడ్డు బాగుచేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

9 కి.మీటర్ల రోడ్డు

ఆమనగల్లులోని శ్రీశైలం–హైదరాబాద్ జాతీయ రహదారి నుంచి మాడ్గుల మండలం ఇర్విన్ మీదుగా నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండల కేంద్రానికి దాదాపు 27 కి.మీ రోడ్డు ఉండగా ఐదేళ్ల క్రితం దాదాపు 12 కి.మీ మేర రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు. మిగతా 15 కి.మీల రోడ్డును అలాగే వదిలేశారు. సింగిల్ రోడ్డుగా ఉన్న రోడ్డును ఆమనగల్లు నుంచి జంగారెడ్డిపల్లి వరకు మాడ్గుల మండలం చంద్రాయణపల్లి నుంచి సిరసనగండ్ల వరకు డబుల్‌రోడ్డు నిర్మాణం చేపట్టారు. అయితే జంగారెడ్డిపల్లి నుంచి చంద్రాయణపల్లి వరకు ఉన్న 9 కి.మీల రోడ్డును డబుల్ రోడ్డుగా నిర్మించలేదు. జంగారెడ్డిపల్లి నుంచి చంద్రాయణపల్లి వరకు ఉన్న సింగిల్ రోడ్డు పూర్తిగా పాడయ్యింది. అడుగడుగునా కంకరతేలి గోతులు ఏర్పడి వాహనదారులు, ప్రయాణికులు నరకయాతన అనుభవిస్తున్నారు.

ఆధునీకరణకు రూ.2.12 కోట్లు

జంగారెడ్డిపల్లి నుంచి చంద్రాయణపల్లి గ్రామల మధ్య ఉన్న 9 కి.మీ రోడ్డు ఆధునీకరణకు గతేడాది ప్రభుత్వం రూ.2.12 కోట్లు మంజూరు చేసింది. రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు కావడంతో అధికారులు టెండర్లు పిలిచారు. గత నాలుగు నెలల క్రితం ఆధునీకరణ పనులకు అప్పటి కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ శంకుస్థాపన చేశారు. నిధులు మంజూరై టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని తెలిసింది. నిధులు మంజూరైనా పనులను ప్రారంభించలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా బీటీరోడ్డు పనులు ప్రారంభమయ్యేలా చూడాలని ప్రజాప్రతినిధులు, అధికారులను ప్రజలు కోరుతున్నారు.